క్లుప్తంగా

అంగన్‌వాడీ సెంటర్‌కు స్టీల్ ప్లేట్ల వితరణ



కార్యకర్తలకు స్టీల్‌ప్లేట్లు అందిస్తున్న వెంకటలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌కు 68వ వార్డు వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు గొంతిన వెంకటలక్ష్మి 50 స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఆమె మనుమడు అత్తిలి శివనాగ దుర్గా తేజస్విన్ పుట్టిన రోజును పురస్కరించుకుని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ పి.దుర్గాబాయికి వాటిని అందజేశారు. తేజస్విన్ తండ్రి అత్తిలి శేఖర్, దీపిక పాల్గొని చిన్నారులకు, ఎంపీపీ స్కూల్ పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.సత్యవతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు

ఉక్కునగరం: కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కారు రమణ, కె. వంశీకృష్ణ, కోరుబిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



సీఐఎస్ఎఫ్ కాలనీలో ర్యాలీ చేస్తున్న మలేరియా సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కాలనీలో శనివారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా మలేరియా అధికారి ఎం. తులసి ఆదేశాల మేరకు గాజువాక మలేరియా యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కె. వరహాలదొర పర్యవేక్షణలో ఈ ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ డెంగ్యూ రాకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. హెల్త్ ఇనస్పెక్టర్లు కుమార్, నాయుడు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది చలపతిరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో కిశోర్‌కు 3వ ర్యాంక్



కిశోర్‌ను అభినందిస్తున్న బలరామకృష్ణ

గాజువాక: ఆంధ్రప్రదేశ్ పీజీ సెట్ ఫలితాల్లో స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాల విద్యార్థి ఎల్.కిశోర్ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న కిశోర్ లైఫ్ సైన్సెస్ విభాగంలో ఈ ర్యాంక్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్‌ను కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ అభినందించారు.

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా

- మెరుస్తున్న రహదారులు
- వాహనచోదకుల హర్షాతిరేకాలు



64వ వార్డు కొంగపాలెంలోని కొత్త రోడ్డు



72వ వార్డు వుడా కాలనీలోని శిథిలమైన రోడ్డు



72వ వార్డు వుడా కాలనీలోని కొత్త రోడ్డు



77వ వార్డు పెదపాలెం సచివాలయం నుంచి కేఎస్ పాలెం వరకు ఉన్న గతంలో ఇలా..



మరమ్మతుల అనంతరం కేఎస్ పాలెం రోడ్డు

పెదగంట్యాడ: అన్ని వార్డుల్లో రహదారులు మెరిసిపోతున్నాయి.. అద్దంలా కనిపిస్తున్నాయి. పెదగంట్యాడ మండలంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జీవీఎంసీ 77వ వార్డు పెదపాలెం సచివాలయం నుంచి కేఎస్ పాలెం వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఈ నేపథ్యంలో రూ.98 లక్షలతో అక్కడ కొత్తగా రోడ్డు నిర్మించారు.
- జీవీఎంసీ 64వ వార్డు కొంగపాలెం గ్రామంలోని రహదారి ఛిద్రమై ప్రజలు ఇబ్బంది పడేవారు. ఎన్నో ఏళ్లగా నిర్మాణానికి నోచుకోని ఈ రహదారిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.19.80 లక్షలతో నిర్మించారు. కాలువ నిర్మాణ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి.
- జీవీఎంసీ 72వ వార్డు వినాయకనగర్ వుడా కాలనీలోని చర్చి నుంచి ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. చినుకు పడితే చాలు బురదమయంగా మారేది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఆ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోయేవారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.14 లక్షలతో ఇక్కడ కొత్తగా రోడ్డు నిర్మించారు. దీంతో వాహనచోదకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

18న మెగా జాబ్ మేళా

గాజువాక: వివిధ కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, వరుణ్ మోటార్స్, బీమా జ్యువెల్స్, అపోలో ఫార్మసీ, ట్రెస్ దాబా తదితర కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. మొత్తం 260 పోస్టులకు ఎంపిక జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు అర్హత ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలుంటాయని తెలిపారు. అభ్యర్థులు విశాఖ, నక్కపల్లి, గాజువాక, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, మెకానికల్ డిప్లమా, ఐటీఐ ఫిట్టర్, డీజిల్ మెకానిక్, బీ, డీ, ఎం ఫార్మసీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని, మంగళవారం ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 92925 53352 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

డ్యాన్స్ మాస్టర్‌కు సత్కారం

పెదగంట్యాడ: బీజేపీ సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా సినిమా దర్శకుడు, డ్యాన్స్ మాస్టర్ వెంకట్‌ను 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం సత్కరించారు. వారు మాట్లాడుతూ సినిమా రంగంలో వెంకట్ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై హోంగార్డులకు సూచనలు



హోంగార్డులకు సూచనలు ఇస్తున్న భద్రతా విభాగాధిపతి రామ్‌ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లోపల రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉక్కు భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఉక్కు భద్రతా విభాగంలో స్టీల్‌ప్లాంట్ హోంగార్డులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్లాంట్ వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ గన్ వినియోగించాలని సూచించారు. వేగ పరిమితి దాటి వెళ్లే వాహనాలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. భారీ వాహనాల ప్రయాణ సమయంలో రోడ్లపై రద్దీ లేకుండా చూడాలని సూచించారు. రహదారి భద్రతాధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ హోంగార్డులకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో భద్రతా విభాగం ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు



కేజీహెచ్‌లో పింఛన్ అందిస్తున్న దువ్వాడ వలంటీర్ నానాజీ

అగనంపూడి: నవరత్నాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరువ చేస్తున్న వలంటీర్ల సేవలను లబ్ధిదారులు కొనియాడుతున్నారు. అటువంటి వలంటీర్లపై ఆరోపణలు చేయడం తగదని చెబుతున్నారు. లబ్ధిదారులు ఏ ప్రాంతంలో ఉన్నా పింఛన్లు అందివ్వడంతో పాటు రేషన్ బియ్యం దగ్గరుండి ఇంటింటికీ పంపిణీ చేయడం దేశ ద్రోహమా? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తున్నారు. నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలుకుతున్నారు.

పక్క జిల్లాలో ఉన్నా పింఛన్ అందించారు



మా బంధువుల్లో ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లా వెళ్లారు. పింఛన్ అందించే సమయానికి ఆమె రాలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న ఇక్కడి వలంటీర్ ఆ జిల్లాకు వెళ్లి పింఛన్ అందించారు. అలాగే కేజీహెచ్‌లో, ఇతర ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. వారి సేవలు అభినందనీయం. – డి.శాంతి, లంకెలపాలెం

వారి సేవలు మర్చిపోలేం



మా పాప కాకినాడ కళాశాలలో బీటెక్ చేస్తోంది. మా పాపకు విద్యాదీవెన, వసతి దీవెన రావడానికి వలంటీర్ ఎంతో కృషి చేశారు. సమయానికి తెలియజేసి, దరఖాస్తు చేయించారు. నాలా ఎంతోమందికి సంక్షేమ పథకాల కోసం ఎవరి దగ్గరకు వెళ్లే అవసరం లేకుండా, వలంటీర్లే తెలియజేస్తున్నారు. దగ్గరుండి దరఖాస్తు చేయిస్తున్నారు. ఇక కరోనా సమయంలో వారు అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేం. – ఎం.నళిని, ఫార్మాసిటీ కాలనీ

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

500 మందికి వైద్య పరీక్షలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాశ్

ఉక్కునగరం: లీ హెల్త్ డొమైన్, జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని వెల్‌నెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, జేసీఐ అధ్యక్షురాలు ఎ. లీలారాణి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ జగదేవ్, సుబ్బారావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆదివారం కూడా శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 500 మంది శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు జయలక్ష్మి, లావణ్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో ఉక్కు పరిరక్షణ



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 884వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పోరాట కమిటీ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేకు సిద్ధం కండి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు

డాబాగార్డెన్స్: నగరంలో వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దృష్టి సారించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ప్రజా ఆరోగ్య సిబ్బంది, అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం నగర పరిధిలోని ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది, వలంటీర్లు ప్రతీ శుక్రవారం ఇంటింటికీ వెళ్లి దోమలు వృద్ధి చెందే ప్రదేశాలపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రామ్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ శశిభూషణ్, జిల్లా మలేరియా అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

శరణ్యకు చిత్రలేఖనంలో గోల్డ్‌మెడల్

జాతీయ స్థాయిలో ప్రథమస్థానం



శరణ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విశాలాక్షి

ఉక్కునగరం: స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎస్.కె.ఎస్.వి. శరణ్యకు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో గోల్డ్ మెడల్ లభించింది. ఇటీవల విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో శరణ్య ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శరణ్యకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ జి.దానయ్య, పాఠశాల ఆర్ట్ టీచర్ కె. శ్రీనివాసరావులను ప్రిన్సిపాల్ విశాలాక్షి సత్కరించారు. ఆమెను చిత్రలేఖనం వైపు ప్రోత్సహించిన తల్లిదండ్రులు జి.మాధురి, ఎస్. విజయసారథిలను అభినందించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



సత్య హెల్త్‌కేర్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 75వ వార్డు దుర్గవానిపాలెం ఎంపీపీ పాఠశాల వద్ద బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజారావు ఏర్పాటు చేసిన సత్య హెల్త్ కేర్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. రాజారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి లక్ష్మీబాయి, బొడ్డు నర్సింహపాత్రుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పోర్టు కార్మికులకు జీతాలు పెంచాలి'

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు జీతాలు వెంటనే పెంచాలని స్టీల్ ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. అఖిలపక్ష నాయకులు కణితి అప్పల రాజు, తదితరులు కార్మికులకు మద్దతు తెలిపారు.

చిన్నారులకు అల్పాహారం పంపిణీ



చిన్నారులకు అల్పాహారం వడ్డిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గాజువాక: బీసీ సంక్షేమ సంఘం గాజువాక నాయకులు స్థానిక స్ఫూర్తి అనాథాశ్రమంలోని చిన్నారులకు శనివారం అల్పాహారం పంపిణీ చేశారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్ చేసి, చిన్నారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లా రమణ యాదవ్, జాగరపు శ్రీను, వియ్యపు కొండబాబు, జాగరపు ముసలయ్య, కోన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

యారాడలో 'బీచ్ క్లీనప్ డ్రైవ్'



యారాడ బీచ్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న నేవీ అధికారులు

పెదగంట్యాడ: తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యారాడ, ఆర్కే, జాలారి పేట, భీమిలి బీచ్‌లతో పాటు మేఘాద్రిపేట నదీ పరివాహక ప్రాంతంలో శనివారం వ్యర్థాలను తొలగించారు. అన్ని ప్రాంతాల్లో కలిపి సుమారు 1000 కిలోల చెత్తను ఏరివేశారు. కోస్టల్ క్లీనప్ కింద ప్రతి నెలా ఒక రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నావికాదళానికి చెందిన 700 మందికి పైగా సర్వీస్, డీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అన్నసమారాధన

పెదగంట్యాడ: 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. గాంధీనగర్ వాసుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.

